ప్రధాని నరేంద్ర మోదీతోనే దేశాభివృద్ధి


మోహన్ యాదవ్ సన్మానిస్తున్న గోవింద్‌రాఠి, మనోజ్ జైస్వాల్, సుమిత్‌రాఠి

అబిడ్స్: ప్రధానినరేంద్ర మోదీతోనే దేశం అన్ని రంగాల్లో అగ్రగామిగా ఉందని రాష్ట్ర బీజేపీ నాయకులు గోవింద్‌రాఠి పేర్కొన్నారు. ఈ పార్లమెంటు ఎన్నికల్లో 400 సీట్లు బీజేపీ కైవసం చేసుకొని రికార్డు సృష్టించబోతుందన్నారు. తెలంగాణలో 12 నుంచి 14 ఎంపీ స్థానాలు కైవసం చేసుకుంటామన్నారు. నగరానికి వచ్చిన మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్‌ను ఆయన సన్మానించారు. అనంతరం గోవింద్‌రాఠి మాట్లాడుతూ..హైదరాబాద్ పార్లమెంట్‌లో మజ్లిస్ పార్టీ పెద్ద ఎత్తున రిగ్గింగ్‌కు పాల్పడినప్పటికీ బీజేపీ అభ్యర్థి మాధవీలత భారీ మెజార్టీతో విజయం సాధిస్తుందన్నారు. మజ్లిస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పబోతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మనోజ్ జైస్వాల్, సుమిత్‌రాఠి తదితరులు పాల్గొన్నారు.

రచయితలు ఎక్కువ చదివి తక్కువ రాయాలి

సుల్తాన్‌బజార్: రచయితలు ఎక్కువ చదివి తక్కువ రాయాలని ప్రముఖ రచయిత పరవస్తు లోకేశ్వర్ సూచించారు. తెలంగాణ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో శనివారం డాక్టర్ దేవులపల్లి రామానుజరావు కళా మందిరంలో ఏర్పాటు చేసిన పరిణితవాణి కార్యక్రమంలో ఆయన స్వీయ జీవిత, సాహిత్య విశేషాలతో కూడిన ప్రసంగం చేశారు. హైదరాబాద్ పాత నగరంలో 1951లో జన్మించానని, చిన్ననాటి నుంచి ఇంట్లో పుస్తకాలు చదివే వాతావరణం ఉండడం వల్ల వాటిని చదివే అలవాటు వచ్చిందని తెలిపారు. తెలంగాణ ఉద్యమ చరిత్ర, సలాం హైదరాబాద్, చార్మినార్ కథలు తదితర రచనలు తనకెంతో పేరును తెచ్చిపెట్టాయన్నారు. ఈ కార్యక్రమంలో పరిషత్ అధ్యక్షుడు ఎల్లూరి శివారెడ్డి, పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య, డాక్టర్ సిల్మానాయక్‌లతో పాటు సాహితీప్రియులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో ప్రసంగిస్తున్న రచయిత లోకేశ్వర్

ఘనంగా అన్నమయ్య జయంతి


అన్నమయ్య సంకీర్తనలను ఆలపిస్తున్న గాయనీ గాయకులు

గన్‌ఫౌండ్రీ: స్వర భారతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బషీర్‌బాగ్‌లోని స్వర భారతి సంగీత పాఠశాలలో తాళ్లపాక అన్నమయ్య 616వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కర్ణాటక సంగీత కళాకారులు రాధ, పద్మావతి, కనక మహాలక్ష్మి తదితర గాయనీ గాయకులు అన్నమయ్య సంకీర్తనలను ఆలపించారు. అనంతరం స్వర భారతి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు జి.శ్రీనివాస్ మాట్లాడుతూ..భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను, ఆధ్యాత్మిక గురువులను గౌరవించాలని ఈ సంస్కృతిని భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు.

శ్రీశైలంలో మాదిగలకు వసతి కల్పించాలి

చార్మినార్: శ్రీశైలం దేవస్థానం వద్ద అన్ని సామాజిక వర్గాల వారికి ఉన్నట్లే మాదిగ సామాజిక వర్గాలకు కూడా వసతి సముదాయం ఉండేటట్లు చూడాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ ఓల్డ్ సిటీ ఇన్‌చార్జి నర్సింహస్వామి ఆధ్వర్యంలోని ఎమ్మార్పీఎస్ ప్రతినిధుల బృందం శనివారం మంద క్రిష్ణ మాదిగను కలిసింది. ఈ సందర్భంగా నర్సింహస్వామి మాదిగ మాట్లాడుతూ.. శ్రీశైలం మల్లికార్జున స్వామి దర్శనానికి ప్రతిరోజూ వందలాది మంది మాదిగ సామాజిక వర్గానికి చెందిన భక్తులు వెళుతుంటారని.. తమ సామాజిక వర్గానికి సంబంధించిన వసతి సముదాయం లేకపోవడంతో పలు సమస్యలు ఎదురవుతున్నాయనే విషయాన్ని ఆయనకి వివరించామన్నారు. సంబంధిత అధికారులతో పాటు దేవస్థానం అధికారులతో చర్చించి వసతి సముదాయం నిర్మాణ ఏర్పాటుకు కృషి చేయాలని కోరామన్నారు. మస్కూరి శ్రీశైలం, చిత్తుల చిన్న మాదిగ, మస్కూరి రోహిత్, శివ తదితరులున్నారు.


మందకృష్ణ మాదిగను కలిసిన ప్రతినిధులు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి


చార్మినార్ కట్టడం వద్ద గ్రానైట్ రోడ్లను శుభ్రం చేస్తున్న సిబ్బంది

చార్మినార్: తమ పరిసరాలను ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదని పేర్కొంటూ జీహెచ్‌ఎంసీతో కలిసి ఎన్‌టీపీసీ ఆధ్వర్యంలో శనివారం ఉదయం చార్మినార్ కట్టడం వద్ద గ్రానైట్ రోడ్లను చీపుర్లతో ఊడ్చి శుభ్రం చేశారు. ఎన్‌టీపీసీ ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీ నుంచి జరుగుతున్న స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు చారిత్రాత్మకమైన కట్టడాల వద్ద ఎలాంటి చెత్తాచెదారం లేకుండా చూడాలని ఎన్‌టీపీసీ ఈడీ(న్యూక్లియర్) ప్రసెన్‌జిత్ పాల్ అన్నారు. సంస్థ ఉద్యోగులు చేతుల్లో బ్యానర్లు, ప్ల కార్డులు పట్టుకుని స్థానికులకు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో జీఎం (హెచ్‌ఆర్) పానిగ్రహీ తదితరులు పాల్గొన్నారు.

మురుగు సమస్యను పరిష్కరించండి



గోల్కొండ: షేక్‌పేట్ సూర్యనగర్ కాలనీలో ప్రధాన వీధులపై మురుగు కాలువలా ప్రవహిస్తుంది. సూర్యనగర్ కాలనీలోని పార్కు రోడ్డు, రవీంద్రభారతీ స్కూల్ రోడ్డు, గెలాక్సీ రోడ్డు తదితర ప్రాంతాల్లోని డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ పూర్తిగా ధ్వంసమయ్యాయి. జలమండలి, బల్దియా అధికారులకు చెప్పినా చేద్దాం ..చూద్దాం అంటూ కాలం దాట వేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పాదచారులు నడవలేని పరిస్థితి ఉందని పలువురు వాపోతున్నారు.


ఎన్నికల కోడ్ ఇంకా అమలులో ఉన్నందున ప్రజా ప్రతినిధులు కొందరు ఇంటి పట్టున ఉండగా మరికొందరు తమ కుటుంబ సభ్యులతో కాలక్షేపం చేస్తున్నారు. ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ శనివారం హకీంపేట్‌లోని మసీదు వద్ద శనివారం తన సోదరుడు అలీముద్దీన్‌తో కలిసి పావురాలకు గింజలు వేస్తూ సరదాగా గడిపారు. - గోల్కొండ

పనిచేయని ఏటీఎం సెంటర్లతో పరేషాన్


ఆంధ్రా బ్యాంకు చౌరస్తాలో పనిచేయని ఏటీఎం సెంటర్లు

నాంపల్లి: వినియోగదారుడికి అత్యవసర సమయాల్లో ఆదుకోవాల్సిన ఏటీఎం సెంటర్లు చెయ్యి ఇస్తున్నాయి. నగదు కోసం ఏటీఎం సెంటర్‌కు వెళ్తే పనిచేయడం లేదని తెలుసుకుని మరో కేంద్రానికి పరుగులు పెడుతున్నారు. అక్కడ కూడా ఏటీఎం సెంటర్ల పనిచేయకుంటే మరో చోటుకు ఉరుకులాడుతున్నారు. ఇలా ఒకటి రెండు చోట్ల కాదు, ఎక్కడ చూసినా వినియోగదారులకు చుక్కలు చూపిస్తున్నారు. ఒకచోట క్యాష్ లేకుంటే.. మరోక చోట ఔట్ ఆఫ్ సర్వీస్, మరొక చోట పనిచేయడం లేదనే ట్యాగ్‌లు తగిలించి ఉంటున్నాయి. న్యూమల్లేపల్లిలో, బజార్‌ఘాట్, మల్లేపల్లి, మాసబ్‌ట్యాంక్ తదితర ప్రాంతాల్లో ఏటీఎం సెంటర్లు వినియోగంలో ఉండటం లేదు. అలంకార ప్రాయంగా దర్శనమిస్తున్న వాటిని అందుబాటులోకి తీసురావాల్సిన బాధ్యత బ్యాంకు అధికారులకు ఉంది. కానీ బ్యాంకు అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. ప్రధానంగా ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంకులకు చెందిన ఏటీఎం సెంటర్లు పనిచేయడం లేదు. పనిచేయని ఏటీఎం సెంటర్లు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, ఏటీఎం సెంటర్లలో 24 గంటలు నగదును నిల్వ ఉంచేలా చూడాలని వినియోగదారులు కోరుతున్నారు.

28 నుంచి రంగనాథ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

- 30న గరుడ ప్రసాద పంపిణీ
- 31న స్వామివారి కల్యాణం
- జూన్ 1న రథోత్సవం, 3న లక్ష పుష్పార్చన


బ్రోచర్ విడుదల చేసిన ఆలయ ప్రతినిధులు తదితరులు

జియాగూడ: ఈ నెల 28 నుంచి జూన్ 3వ తేదీ వరకు జియాగూడ రంగనాథ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను భారీ ఎత్తున నిర్వహిస్తున్నట్లు ఆలయ ఫౌండర్ ట్రస్టీ ఎస్ టీ.చారి, ప్రతినిధి శేషాచార్యులు, ప్రధాన అర్చకుడు శ్రీనివాస రంగనాథ, బద్రినాథ్ అన్నారు. ఈ మేరకు శనివారం జియాగూడలోని చారిత్రాత్మక రంగనాథ ఆలయంలో బస్తీ సంఘాలు, పలు పార్టీల నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ..ప్రతి సంవత్సరం లాగే ఈ సారి కూడా బ్రహ్మోత్సవాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయన్నారు. ఈ నెల 28న ఉదయం అభిషేకం, అర్చనలు, ప్రత్యేక దర్శనం, సాయంత్రం పుణ్యాహవాచనం, రక్షాబంధనంలు ఉంటాయన్నారు. 29న ధ్వజారోహణం, గరుడ ప్రసాదం పంపిణీ ప్రత్యేకంగా ఉంటుందన్నారు. పిల్లలు కాని వారు, వ్యాధిగ్రస్థులు ఉన్నవారు స్వీకరిస్తే ఎంతో మేలు జరుగుతుందన్నారు. 30న నిత్య పూజలు, హవనం, బలిహారము, హారతి, ప్రసాద వితరణ, 31న మంగళస్నానం, సాయంత్రి శ్రీదేవి భూదేవి సమేత రంగనాథ స్వాముల ఎదుర్కోళ్లు, కల్యాణ మహోత్సవం నిర్వహిస్తామన్నారు. జూన్ 1న ఉదయం పూర్ణాహుతి, సాయంత్రం స్వామివారి రథోత్సవం జియాగూడ ఆలయం నుంచి పురానాపూల్ వరకు తిరిగి ఆలయానికి చేరుకుంటుందన్నారు. 2న అభిషేకం, చక్ర స్నానం, సాయంత్రం పూర్ణాహుతి, కుంభ ప్రోక్షణ, 3న నిత్య పూజలు, సాయంత్రం లక్ష పుష్పార్చన కార్యక్రమం విశేషంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ గోల్కొండ జిల్లా డేయిరీసెల్ కన్వీనర్ శివకుమార్ యాదవ్, అధికార ప్రతినిధి గూడుమణి చంద్రకాంత్, అధ్యక్షుడు జే.లక్ష్మీనారాయణ, సుదర్శన్ ముదిరాజ్, వివేక్ సింగ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు శ్రీనివాస్ గుప్తా, అధ్యక్షుడు నరహరి చారి, కార్వాన్ అసెంబ్లీ యూత్ అధ్యక్షుడు మంగి కిశోర్‌కుమార్, జడల మోహన్, కాంగ్రెస్ నాయకుడు వినోద్ చౌగ్లే, రాజు సింగ్, సంఘాల ప్రతినిధులు సందీప్ లాల్ యాదవ్, మల్లేష్ యాదవ్, రాజ్‌పాల్, నరేష్‌కుమార్, భాస్కర్ గుప్తా, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మోదీ ప్రధానిగా హ్యాట్రిక్ కొట్టడం ఖాయం

గోల్కొండ: నరేంద్రమోదీ ప్రధానిగా హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని బీజేపీ షేక్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు జి.శివకుమార్ అన్నారు. అబ్‌కే బార్ చార్‌సౌ పార్ గ్యారంటీ అని దీనికి తిరుగు లేదని ఆయన అన్నారు. ప్రధాని మోదీ గత పదేళ్ల సుపరిపాలనతో బీజేపీకి దేశ ప్రజల్లో ఆదరణ పెరిగిందని ఈసారి దక్షిణాది రాష్ట్రాల్లో కూడా బీజేపీ విజయ ఢంకా మోగించడం ఖాయమన్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్‌తో పాటు తెలంగాణలో బీజేపీ అత్యధిక స్థానాలు గెలుచుకుంటుందని ఆయన అన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

అబిడ్స్: చెట్లకొమ్మలను తొలగింపు కారణంగా సైఫాబాద్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సైఫాబాద్ డివిజన్ సీబీడీ అధికారులు తెలిపారు. సోమవారం ఉదయం 11 నుంచి 12.30 గంటల వరకు అబిడ్స్ కట్టెల మండిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం, అబిడ్స్ చౌరస్తా నుంచి హైదరాబాద్ పాత కలెక్టర్ కార్యాలయం వరకు కట్టెల మండి, కరిమాబాద్ కాలనీ, జగదీష్‌మార్కెట్, నేతాజీనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే మధ్యాహ్నం 12.30 నుంచి 2 గంటల వరకు గృహకల్ప బిల్డింగ్, చంద్ర విహార్ కాంప్లెక్స్, హిందీ మీలాప్ లేన్, 2బీహెచ్‌కే హౌసెస్, నాంపల్లి కేర్ ఆసుపత్రి, గగన్‌విహార్ కాంప్లెక్స్, సియాసత్ ప్రెస్ ఏరియా, మురళీధర్ బాగ్, డాగ్ ఘర్, అబిడ్స్ మెయిన్‌రోడ్డు ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందన్నారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నాంపల్లి కామత్ హోటల్ రోడ్డు, నాంపల్లి బీఎస్‌ఎన్‌ఎల్ ఆఫీస్, మహేష్‌నగర్ ఏరియా, రాజామాత హోటల్ రోడ్డు ప్రాంతాల్లో సరఫరా ఉండదని అధికారులు వెల్లడించారు.

గుడిమల్కాపూర్‌లో అగ్ని ప్రమాదం

విజయనగర్‌కాలనీ: ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం తెల్లవారుజామున భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఎటువంటి ప్రాణనష్టం జరుగలేదు. ఇన్‌స్పెక్టర్ జి.వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం..ఆసిఫ్‌నగర్ గుడిమల్కాపూర్ ప్రియా కాలనీలో 4వ అంతస్తుల భవనంలో ఇండియన్ గిఫ్ట్ పోర్టల్ పేరిట పుట్టిన రోజుకు, ఇతర శుభకార్యాలకు బహుమతులను అందజేసే వ్యాపారం నిర్వహిస్తుంటారు. కాగా శనివారం తెల్లవారుజామున భవనంలో మంటలు అంటుకొని పొగలు వస్తుండడంతో స్థానికు లు పోలీసులకు సమాచారం అందించారు. లంగర్‌హౌస్ అగ్నిమాపక కేంద్రం సిబ్బంది వాహనంలో వచ్చే సరికి మంటలు ఎగిసి పడుతున్నాయి. గంట సేపు శ్రమించి మంటలను ఆర్పివేయగా అప్పటికే ఆ భవనంలో ఉన్న సామగ్రి పూర్తిగా కాలి బూడిదయింది. దాదాపు రూ.20 లక్షల రూపాయాల వరకు ఆస్తి నష్టం సంభవించినట్లు ఐజీపీ సిబ్బంది తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మహేష్‌గౌడ్‌కు సన్మానం



గోల్కొండ: టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ గౌడ్ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. కార్వాన్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు కురాకుల కృష్ణ ఆధ్వర్యంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.



అలరించిన గోదా కల్యాణం

గన్‌ఫౌండ్రీ: కూచిపూడి యక్షగానం, గోదా కల్యాణం నాట్య ప్రియులను అలరించింది. శనివారం రవీంద్రభారతిలో భరతవేద ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నృత్య గురువు డాక్టర్ శ్రీనివాస వరప్రసాద్ శిష్య బృందం నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా యక్షగాన నృత్య గురువు డాక్టర్ పసుమర్తి శేషుబాబు మాట్లాడుతూ.. 27 మంది కళాకారులు ఏక కాలంలో ప్రదర్శన ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ శాస్త్రీయ కళలను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ఎంతగానో ఉందన్నారు. అంతకుముందు చిన్నారుల నృత్య ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, కూచిపూడి నృత్య గురువు డాక్టర్ విజయ్‌పాల్, గాయకులు మహాలక్ష్మి, విశ్వేశ్వర్‌రావు, సినీ నటి చిత్రలేఖ, స్వరమహతి కళాపరిషత్ అధ్యక్షులు డాక్టర్ బి.ఆదిత్య కిరణ్, సంస్థ డైరెక్టర్ శ్రీనివాస వరప్రసాద్ పాల్గొన్నారు.

అక్రమ పార్కింగ్‌లను సహించేది లేదు


సెవన్ టూమ్స్ చౌరస్తా వద్ద వాహనాలను సీజ్ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

గోల్కొండ: వాహనాలు అక్రమంగా పార్కు చేస్తే సహించేది లేదని గోల్కొండ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌రావు అన్నారు. శనివారం ఆయన ఆధ్వర్యంలో అక్రమ పార్కింగ్‌లపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సెవన్ టూమ్స్ చౌరస్తా, జిషాన్ హోటల్, షేక్‌పేట్ డీమార్ట్, గెలాక్సీ సెంటర్, టోలిచౌకీ చౌరస్తా తదితర ప్రాంతాల్లో అక్రమంగా పార్కు చేసి ఉంచిన ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగించడంతో పాటు పాదచారులకు ప్రమాదాలకు కారణమవుతున్న అక్రమ పార్కింగ్‌లను సహించేది లేదని స్పష్టం చేశారు. అదే విధంగా రోడ్లపై ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తూ వ్యాపారాలు కొనసాగిస్తున్న తోపుడు బండ్లు, టిఫిన్ సెంటర్లపై కూడా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

అంజదుల్లాఖాన్‌కు సన్మానం


అంజదుల్లాఖాన్‌ను సన్మానించిన బుంగ శివ కుమార్

చార్మినార్: ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందిన ఎంబీటీ అధికార ప్రతినిధి అంజదుల్లాఖాన్‌ను ఆ పార్టీ సంయుక్త కార్యదర్శి బుంగ శివకుమార్ ఆధ్వర్యంలోని ప్రతినిధుల బృందం శనివారం కలిసి పరామర్శించారు. వైద్య సేవల అనంతరం డిశ్చార్జి అయిన అంజదుల్లాఖాన్‌ను హఫీజ్ బాబానగర్‌లోని నివాసంలో కలిసి పూల మాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సాధ్యమైనంత త్వరగా పూర్తి స్థాయిలో కోలుకుని తిరిగి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంబీటీ నాయకులు ముస్తఫా మహమూద్, యాదగిరి, శ్రావణ్‌కుమార్, సందీప్‌కుమార్ తదితరులున్నారు.

వెన్న ఈశ్వరప్పకు డాక్టరేట్


వెన్న ఈశ్వరప్పకు డాక్టరేట్‌ను ప్రదానం చేస్తున్న దృశ్యం

అబిడ్స్: సామాజిక సేవకుడు వెన్న ఈశ్వరప్పకు మదర్ థెరిస్సా యూనివర్సిటీ ఆస్ట్రేలియా డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. తెలంగాణ నలుమూలలా పలు గ్రామాల్లో, పలు పట్టణాల్లో నిరుపేదలకు విద్య, మౌలిక వసతులు, నిరంతరం ఎంతో కృషి చేస్తున్న వెన్న ఈశ్వరప్ప సేవలను గుర్తించి ఆస్ట్రేలియాలోని మదర్ థెరిస్సా యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.విజయ సరస్వతి, డీన్ ఆఫ్ ఎంఐటీయూ సీఈఓ డాక్టర్ జాన్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా డీఆర్‌డీఓ సైంటిస్టు డాక్టర్ ప్రభాకరన్, ఐఎస్‌టీ ఎంపీ ఇండియా డైరెక్టర్ సారా వేవ్‌బెన్, సిండికేట్ మెంబర్ సౌత్ ఇండియా డైరెక్టర్ కేఆర్.రవికుమార్ వెన్న ఈశ్వరప్పకు డాక్టరేట్ ప్రదానం చేసి అభినందించారు. ఈ సందర్భంగా వెన్న ఈశ్వరప్ప మాట్లాడుతూ..జీవితాంతం సమాజ సేవకే కృషి చేస్తానన్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో విద్యారంగ అభివృద్ధికి మరింత సేవలందిస్తానన్నారు.

జూన్ 16న పెయింటింగ్ ఎగ్జిబిషన్


ఎగ్జిబిషన్ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మామిడి హరికృష్ణ

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో పీకాసో ది స్కూల్ ఆర్ట్స్ విద్యార్థుల పెయింటింగ్ ఎగ్జిబిషన్ జూన్ 16 నుంచి మూడు రోజుల పాటు రవీంద్రభారతిలో నిర్వహించనున్నారు. శనివారం రవీంద్రభారతిలోని తన కార్యాలయంలో భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ ఎగ్జిబిషన్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వివిధ అంశాలపై విద్యార్థులు గీసిన 45 చిత్రాలను మూడు రోజుల పాటు ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు బైరు రమేష్ పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రార్థనలు


ప్రార్థనలు చేస్తున్న కార్వాన్ ఎంఐఎం నాయకుడు చాట్ల శ్రీనివాస్ తదితరులు

జియాగూడ: హైదరాబాద్ ఎంఐఎం పార్టీ ఎంపీ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీ భారీ మెజార్టీతో విజయం సాధించాలని కార్వాన్ ఎంఐఎం నాయకుడు చాట్ల శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు శనివారం జహంగీర్ పీర్ బాబా దర్గాలో ఆయన ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ..పాతబస్తీ అభివృద్ధి ఒవైసీ తోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో పి.క్రాంతి కుమార్, కె.హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

కౌన్సెలింగ్‌తో సత్ఫలితాలు


ఖాలేద్ అలీఖాన్‌కు టీఎఫ్‌సీఓ సభ్యత్వ పత్రాన్ని అందిస్తున్న మహ్మద్ ముజీబ్

గోల్కొండ: కౌన్సెలింగ్‌తో మెరుగైన ఫలితాలు వస్తాయని తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ రాష్ట్ర చైర్మన్ మహ్మద్ నజీబ్ అన్నారు. గోల్కొండకు చెందిన ఖాలేద్ అలీఖాన్‌కు శనివారం ఆయన టోలిచౌకీ అక్బర్‌బాగ్‌లోని ఆర్గనైజేషన్ కార్యాలయంలో టీఎఫ్‌సీఓ సభ్యత్వ పుస్తకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ ఆర్గనైజేషన్ 15 ఏళ్లుగా పని చేస్తుందన్నారు. వివిధ కారణాల వల్ల మనస్పర్ధలు వచ్చి విడిపోదలచుకున్న దంపతులకు కౌన్సెలింగ్ నిర్వహించి వారి మనస్పర్ధలను దూరం చేశామని అన్నారు.

పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకోవాలి


మాట్లాడుతున్న రాజేశ్వర్ యాదవ్

చార్మినార్: ఖమ్మం, వరంగల్, నల్లగొండ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో నగరంలో నివసించే పట్టభద్రులందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు ఎ.రాజేశ్వర్ యాదవ్ కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని.. అందుకే ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ సంఘం తరపున కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికే మద్దతు తెలియజేస్తున్నామన్నారు. శనివారం జరిగిన సంఘం సర్వసభ్య సమావేశంలో తాము ఏకగ్రీవంగా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు.

బస్టాప్‌లు కబ్జా..


డెక్కన్ పార్కు వద్ద బస్టాప్‌లో తోపుడు బండి, ఇతర సామాన్లు

గోల్కొండ: బస్టాప్‌లు కబ్జాకు గురవుతున్నాయి. పర్యాటక ప్రాంతం అయిన డెక్కన్ పార్కు వద్ద పర్యాటకుల కోసం ప్రత్యేకంగా బస్టాప్‌లు నిర్మించారు. కాగా ఈ బస్టాప్‌ను స్థానికంగా ఉండే తోపుడు బండ్ల వ్యాపారి ఒకరు దర్జాగా కబ్జా చేశారు. బస్టాప్‌లోనే తోపుడు బండి ఇతర సామగ్రిని పెట్టి బస్టాప్ తనదే అంటూ దర్జాలకు పోతున్నాడు. బస్టాప్‌పై ఉన్న పోస్టర్లను తొలగించి మరి వ్యాపారం చేసుకుంటున్నాడు.


మధ్యప్రదేశ్ సీఎంకు స్వాగతం

అబిడ్స్: మధ్యప్రదేశ్ బీజేపీ ముఖ్యమంత్రి మోహన్‌యాదవ్‌కు గోల్కొండ జిల్లా బీజేపీ కిసాన్ మోర్చ ప్రధాన కార్యదర్శి ముక్క కృష్ణా గుప్తా ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. నగరానికి వచ్చిన ఆయనకు శాలువాతో కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ముక్క కృష్ణాగుప్తా మాట్లాడుతూ..కేంద్రంలో బీజేపీ 400 పార్లమెంటు సీట్లలో విజయం సాధించి రికార్డు సృష్టిస్తుందన్నారు. జూన్ 4న దేశంలోని అన్ని ప్రాంతాల్లో బీజేపీ పండుగ చేస్తుందన్నారు.


స్వాగతం పలుకుతున్న ముక్క కృష్ణాగుప్తా తదితరులు

గంజాయి విక్రేతల అరెస్ట్


ముఖేష్ సింగ్


అభిషేక్ సింగ్

అబిడ్స్: గంజాయి స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న తండ్రి, కొడుకులను తెలంగాణ యాంటీ నార్కొటిక్ బ్యూరోతో కలిసి షాయినాయత్‌గంజ్ పోలీసులు అరెస్టు చేసి 22 కిలోల గంజాయితో పాటు రూ.8.74 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు సౌత్, వెస్ట్ జోన్ ఇన్‌చార్జి డీసీపీ స్నేహ మెహ్రా ఓ ప్రకటనలో పేర్కొన్నారు. లోయర్ ధూల్‌పేట జుమ్మేరాత్‌బజార్‌కు చెందిన చురమన్ ముఖేష్ సింగ్ (51) గంజాయి వ్యాపారి, అతని కుమారుడైన చురమన్ అభిషేక్ సింగ్ (25) విద్యార్థి, తండ్రి, కొడుకు కలిసి హోండా యాక్టివాపై వస్తుండగా జుమ్మేరాత్ బజార్‌లోని అవంతీబాయి విగ్రహం జంక్షన్ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానం కలిగి ఆపారు. హోండా యాక్టివాను సోదా చేయగా తెలుపు రంగు పాలిమర్ బ్యాగులో 20 కిలోల గంజాయి లభించింది. ఇంట్లో రెండు కిలోల గంజాయి, రూ.8.74 లక్షల నగదు లభించింది. ఈ నగదు కూడా గంజాయి విక్రయించడం ద్వారా కూడబెట్టిందేనని తెలిసింది. వీరిద్దరిని అరెస్టు చేసి పోలీసులు వీరికి గంజాయిని సమకూర్చిన హయత్‌నగర్‌లోని శివం మిల్స్ కాలనీకి చెందిన పరికుప్పల మల్లేష్(32) కోసం గాలిస్తున్నారు.

మరో ఘటనలో మహిళ..

గంజాయి విక్రయిస్తున్న మహిళతో పాటు మరొకరిని పోలీసులు అరెస్టు చేయగా రౌడీషీటర్ మన్మోహన్ సింగ్‌తో పాటు మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు సీఐ మహేష్ గౌడ్ తెలిపారు. రౌడీషీటర్ మన్మోహన్ సింగ్ ఆధ్వర్యంలో గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో శనివారం పోలీసులు దాడులు నిర్వహించారు. అప్పర్ ధూల్‌పేట రహీంపురాలో సంగీతాబాయి(62), రహీంపురా గాయత్రి ఫంక్షన్ హాల్ సమీపంలో ఎం.అజయ్‌కుమార్ అలియాస్ కార్తీక్ (25)ను అరెస్టు చేసి 23.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో గంజాయి వ్యాపారులు ఆనంద్‌సింగ్, ఆకాష్ సింగ్ పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు.

మంగళహాట్‌లో తల్లి, కొడుకు..

గంజాయి విక్రయిస్తున్న తల్లి, కొడుకును మంగళహాట్ పోలీసులు అరెస్టు చేశారు. మంగళహాట్ జాలీ హనుమాన్ ప్రాంతానికి చెందిన విజయలక్ష్మి అలియాస్ విజయాబాయి (49) గంజాయి విక్రేత, ఇంటి వద్ద కొడుకు అభిషేక్ (19) తో కలిసి గంజాయి విక్రయిస్తుండగా శనివారం అరెస్టు చేశారు. తల్లి, కొడుకు నుంచి మూడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసులో మరో నిందితుడు టింకూ సింగ్ పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు.